'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలో..

కొత్తగూడెం మహిళకు రాష్ట్రస్థాయి రెండో బహుమతి



మారోజు నీరజ

కొత్తగూడెం/ పాల్వంచ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన.. కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాల ముగ్గుల పోటీల్లో భద్రాద్రి జిల్లా మహిళకు రాష్ట్రస్థాయి రెండోబహుమతి దక్కింది. ఈ నెల 6న పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో జిల్లా ప్రథమ విజేతగా నిలిచిన కొత్తగూడెం పట్టణం బూడిదగడ్డకు చెందిన ఎం.నీరజ ఉమ్మడిజిల్లానుంచి విజేతగా ఎంపికై బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆమె వేసిన ముగ్గుకు గాను ద్వితీయ బహుమతి పొందారు. ఈ సందర్భంగా నీరజ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంతో 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇక భద్రాద్రి జిల్లా స్థాయి పోటీలకు లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించిన అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ భరత్‌కృష్ణ మాట్లాడుతూ మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేలా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో తాము భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ఆయన రాష్ట్రస్థాయి ద్వితీయ విజేత నీరజకు శుభాకాంక్షలు తెలిపారు.

పత్తిధర నేలచూపు

- నాణ్యతలేదన్న సాకుతో ధరల్లో వ్యాపారుల కోత
- సంక్రాంతికి ముందు రైతుల్లో నిరాశ
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు దక్కని మద్దతు ధర
- అనవసర కోతలతో సీసీఐలో అమ్మకాలకు రైతుల విముఖత

జూలూరుపాడు, జనవరి 10: తెల్ల బంగారం ధరలు రోజురోజుకు దిగజారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి పండుగ ముందైనా ధర పెరగకపోదా అని ఆశతో ఎదురు చూస్తున్న రైతులకు నిరుత్సాహమే ఎదురవుతోంది. ధర పెరిగే పరిస్థితి లేకపోవడంతో రైతులు తమ ఇళ్లల్లో నిల్వ చేసిన పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు చెబుతున్న ధరను చూసి రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పత్తిని తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక, వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించి ఉసూరమంటూ ఇళ్లకు వెళ్తున్నారు. జూలూరుపాడు ఉపమార్కెట్ యార్డుకు బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలను రైతులు భారీగా పత్తిని విక్రయించేందుకు తీసుకొచ్చారు. ఉదయం జెండా పాట రూ.6,500లు పలికినా తరువాత వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేశారు. క్వింటా పత్తిని రూ.5,800ల నుంచి రూ.6,100లకే కొనుగోలు చేశారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7,020లు మద్దతు ధర ప్రకటించినా రైతులకు ఆ ధర లభించడం లేదు. పత్తి నాణ్యంగా లేదని సాకులు చూపుతూ రైతులను వ్యాపారులు బురిడీ కొట్టిస్తూ కొనుగోళ్లు సాగిస్తున్నారు. ఈ మార్కెట్‌లో బుధవారం మొత్తం 5వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.




జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో పత్తిని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

మద్దతు ధరలో కోత..

తెల్ల బంగారం కొనుగోళ్ల ప్రారంభంలో తేమ శాతం పేరుతో ధరలో వ్యాపారులు కోత విధించారు. ఆ తరువాత డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ రావడంతో వ్యాపారులు పత్తి కొనుగోళ్లలో తమ పంథాను మార్చారు. తుఫాన్‌కు పత్తి తడవడంతో నాణ్యత లోపించిందని, నల్లబడడంతో పాటు పుచ్చు ఉందని చూపుతూ ధరలను తగ్గించారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.7,020లు ఉన్నా ఈ ఏడాది జూలూరుపాడులోని ఉప మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు వ్యాపారులు ఆ ధరకు రైతుల నుంచి తెల్లబంగారాన్ని కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. నాణ్యత కొరవడిందని చెబుతూ మద్దతు ధరలో కోతను విధిస్తుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మన పత్తికి ఇతర రాష్ట్రాలలో డిమాండ్ లేదని, అందుకే ఎక్కువ ధర ఇవ్వలేకపోతున్నామని వ్యాపారులు చెబుతున్నారని రైతులు వాపోయారు.

సీసీఐలో అమ్మకాలకు అనాసక్తి

భద్రాద్రి జిల్లాలో సుజాతనగర్ మండలం డేగలమడుగు, బూర్గంపాడు, అశ్వాపురం మండలంలోని నెల్లిపాక, ఇల్లెందు మార్కెట్ పరిధిలోని కారేపల్లిలో నాలుగుచోట్ల సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నాలుగు కేంద్రాల పరిధిలో 20 వేల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకెళితే అక్కడ కొనుగోళ్లలో విధించే నిబంధనలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పత్తిలో నలక ఉందని, నాణ్యంగా లేదని క్వింటాకు 4 నుంచి 5 కేజీల తారం తీస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. అంతేకాకుండా పత్తి అమ్మిన 20రోజులు దాటిన తరువాత నగదు రైతుల ఖాతాలలో జమ చేస్తున్నారు. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాలలో కూడా క్వింటా పత్తిని రూ.6,900ల లోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కోవడం కన్నా ప్రవేటు వ్యాపారులకే విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

టీఎస్ జెన్కో క్రీడా పోటీల్లో

కేటీపీఎస్ జట్ల సత్తా

పాల్వంచ, జనవరి 10: టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు రెండోరోజైన బుధవారం ఉత్కంఠబరితంగా సాగాయి. ఫుట్‌బాల్ పోటీలో కేటీపీఎస్ 5, 6 దశల జట్టు 5-0 స్కోరుతో విద్యుత్‌సౌధాపై విజయం సాధించింది. ఇక కేటీపీఎస్ 7వ దశ జట్టు 6-0 స్కోరుతో బీటీపీఎస్‌పై ఘన విజయం సాధించింది. చివరిగా నువ్వానేనా అనేలా సాగిన మరో మ్యాచ్‌లో కేటీపీఎస్ 5, 6 దశల జట్టు 1-0 స్కోరుతో కేటీపీఎస్ 7వ దశపై విజయం సాధించింది. అదే విధంగా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో కేటీపీఎస్ 7వ దశ జట్టు 2-0 స్కోరుతో జూరాల జట్టుపై విజయం సాధించగా 5, 6 దశల జట్టు 2-0 స్కోరుతో శ్రీశైలంపై విజయం సాధించింది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నమెంట్లలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేటీపీఎస్ 7వ దశ సీఈ వెంకటేశ్వరరావు, గేమ్స్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, మెంబర్లు లోహిత్ ఆనంద్ పోటీలను పర్యవేక్షించారు.

ప్రభుత్వ భూముల

ఆక్రమణల నియంత్రణపై యంత్రాగం దృష్టి

నేడు కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం

ఖమ్మం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఖాళీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. ఆక్రమణల నియంత్రణపై జిల్లా యంత్రాగం దృష్టిసారించింది. ఇప్పటికే ప్రభుత్వ భూముల ఆక్రమణ అంశంపై తీవ్రంగా స్పందించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని తీరుతామని, వాటిని ఆక్రమించిన వారెంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతోపాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూఆక్రమణలు ఒక్కోటి వెలుగుచూస్తుండడంతో ప్రభుత్వ భూముల ఆక్రమణల నియంత్రణ కోసం ప్రస్తుతం ఆయాశాఖల అధికారులను అప్రమత్తం చేసేందుకు ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ వీపీ గౌతమ్ సమావేశం ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జీవో 59ను అడ్డుపెట్టుకుని కొందరు రూ.కోట్ల విలువైన స్థలాలు, భూములను కబ్జా చేసి క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. మరోవైపు జిల్లాలో కూసుమంచి నుంచి కల్లూరు వరకు ఎన్నెస్పీ ఎడమకాలువకు సంబంధించిన మిగులు భూములను కూడా తప్పుడు ధ్రువపత్రాలతో కొందరు కబ్జాలు సాగించారు. ఎన్నెస్పీ మిగులుభూములను రైతుల పట్టా భూములుగా చూపించి వారి వద్ద కొనుగోలు చేసినట్టు పత్రాలు సృష్టించి.. ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారుల అండతో కొందరు హక్కుపత్రాలు సాధించారు. రెవెన్యూ అధికారులతో నోటీసులు ఇప్పించుకుని కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం, కొందరు కోర్టుకు వెళ్లి ప్రభుత్వం తరపున రెవెన్యూ, ఎన్నెస్పీ అధికారులను కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా చూసుకుని తమకు అనుకూలంగా ఆర్డర్లు వచ్చేలా ఆధారాలు చూపించుకోవడం ద్వారా రూ.కోట్ల విలువైన ఎన్నెస్పీ భూములను మింగేశారు. ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో ఒకరైతుకు ఎన్నెస్పీ మిగులుభూమి ఎకరం ఉంటే మూడు ఎకరాలు ఉన్నట్టుగా తప్పుడు రికార్డులు చూపించి ఎన్నెస్పీకి చెందిన మరో రెండెకరాల భూమిని ముగ్గురికి అమ్మడంతో ముగ్గురు ఈభూమి తమదంటే తమదని రంగంలోకి దిగడంతో పెద్దఘర్షణ సాగింది. కొన్ని బహిర్గమతవుతుండగా కొన్ని లోలోపల సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. ఎన్నెస్పీ, రెవెన్యూ శాఖల అధికారులు ఇవి తమకు సంబంధం లేదన్నట్టు తమశాఖ పరిధి కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు రాత్రికి రాత్రే ప్రహరీలు, షెడ్ల నిర్మాణం నిర్వహించి ఇంటినెంబర్లు పొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలతోపాటు జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రభుత్వ శాఖల ఆధీనంలో ఉన్న ఎన్నెస్పీ, రెవెన్యూ, దేవాదాయ, మునిసిపల్ తదితర శాఖల పరిధిలోని భూముల పరిరక్షణకు ఆయాశాఖల అధికారులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేశారు. ఏ శాఖలో ఎంత మిగులు భూమి ఉంది, ఖాళీ భూముల పరిరక్షణకు తక్షణం చేపట్టాల్సిన చర్యలుపై దృష్టిసారించనున్నారు. ఎన్నెస్పీ భూములకు సరిహద్దులు ఏర్పాటు, ఫెన్సింగ్‌లు, మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. దీంతో ఉమ్మడి సమావేశం ద్వారా ప్రభుత్వ మిగులు భూములు వాటి ప్రస్తుత పరిస్థితిని అధికారులు గుర్తించి ఆక్రమణల తొలిగింపునకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

తలతాకట్టు పెట్టయినా

ఆరుగ్యారెంటీలు అమలుచేస్తాం

- నెలాఖరు కల్లా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం
- రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మంత్రి పొంగులేటితో కలిసి పాలేరు ఆత్మీయ సమావేశానికి హాజరు
- సాగునీటి ప్రాజెక్టుల్లో గత పాలకులు చేసిన అవినీతిని బయటపెడతామన్న పొంగులేటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఓ అభిమానిని పలకరిస్తున్న పొంగులేటి

కూసుమంచి, జనవరి 10 : తలతాకట్టుపెట్టయినా ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని, అలాగే ఈనెలాఖరు కల్లా రైతులందరి ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమవుతాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 30లక్షల మంది ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని, మిగిలిన వారికి కూడా ఈనెలాఖరు కల్లా అందుతుందన్నారు. ఎంత డబ్బు, అహంకారం ఉన్నా ప్రజల ముందు దిగదుడుపేనన్న విషయాన్ని ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు నిరూపించారన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలన జరుగుతోందని, నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత అధికారులు, ప్రజలపైనే ఉందని, అప్పుడే ఇందిరమ్మ రాజ్యం సాధ్యమవుతుందన్నారు. గత ముఖ్యమంత్రి మాటలకే పరిమితమై కొన్ని కార్యక్రమాలను తుంగలో తొక్కారని, కానీ నేటి ముఖ్యమంత్రి యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని చెప్పారని పేర్కొన్నారు. కార్యకర్తలంతా నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే.. కాంగ్రెస్ లక్ష్యం, రేవంత్ రెడ్డి శ్రమ, సోనియాగాంధీ ఆశీస్సులతో ఇందిరమ్మ రాజ్య స్థాపన జరిగిందన్నారు. వచ్చే వానాకాలం నాటికి గోదావరి జలాలుజిల్లాలోకి ప్రవేశిస్తాయని, పాలేరుకు నీటిని మళ్లించడం ద్వారా పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తన, ప్రభుత్వ లక్ష్యమన్నారు. తమ పదవీకాలంలోనే గోదావరి జలాలు పారించాలని ప్రయత్నిస్తున్నానన్నారు. ఇక జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం అన్నింటినీ పూర్తిచేసే బాధ్యత తీసుకున్నట్టు వెల్లడించారు.

గత పాలకులు ఫైళ్లను మాయం చేయాలని చూశారు : పొంగులేటి

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, దానిని కచ్చితంగా బయటపెడతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాలపై సీఎం సమీక్షిస్తున్నారని, గత పాలకులు ఫైళ్లను మాయం చేయాలని చూస్తే ప్రభుత్వం విజిలెన్స్‌ను అప్రమత్తం చేసి వాటిని స్వాధీనం చేసుకుందన్నారు. నిజంగా తప్పుచేయకపోతే ఫైళ్ల ఎందుకు మాయం చేయాలనుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి గ్రామాల వరకు ఆస్తుల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు వెనకుండి వారి తొత్తులకు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఖమ్మంలో రెండు, మూడు అంశాలు కలెక్టర్ బయటకు తీశారని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రజలకు చెందేలా చేయడానికే తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మువ్వా విజయ్‌బాబు, వజ్జా రమ్య, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, సాధురమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మట్టె గురవయ్య, వినోద, తిరుమలాయపాలెం ఎంపీపీ మంగీలాల్, నాయకులు రవికుమార్, జూకూరి గోపాలరావు, రాంరెడ్డి, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆరు సబ్జెక్టులు.. ఏడు పేపర్లు

- 'పది' సామాన్యశాస్త్రం పరీక్ష రెండ్రోజులు
- వేర్వేరుగా ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ ఎగ్జామ్స్
- ప్రతీ పేపర్‌కు 50 మార్కులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 10: వచ్చే మార్చిలో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షల్లో సామాన్య శాస్త్రం పరీక్షను రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ వేర్వేరుగా ఉండనున్నాయి. ప్రతీ పేపర్‌కు 50మార్కులు ఉంటాయి. ఇప్పటివరకు వీటిని ఒక్కరోజే నిర్వహించేవారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదించింది.

విద్యార్థుల కోరిక మేరకే..

గతంలో రెండు పేపర్లు ఒకే రోజు నిర్వహించడంతో చదవ డం, రాయడంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. భౌతిక రసాయ నశాస్త్రం, జీవశాస్త్రాలకు వేర్వేరుగా పాఠ్యపుస్తకాలు, వాటిని బోధించేందుకు ఇద్దరు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారు. కానీ, ఒకే రోజు పరీక్ష నిర్వహించడంతో ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పిన వేర్వేరు పాఠ్యపుస్తకాల్లోని అంశాలు కలగలిపి రాయాల్సి వచ్చేది. గతంలో అనేక మంది విద్యార్థులు గందరగోళానికి గురై ఉత్తీర్ణత శాతం తగ్గిన విషయం తెలిసిందే. ఈ పరీక్ష వేర్వేరుగా నిర్వహించాలనే డిమాండ్ నాలుగేళ్లగా వినిపిస్తోంది.



ఎంత పట్టుందో తెలుస్తుంది..

పరీక్షలను వేర్వేరుగా నిర్వహించడంతో విద్యార్థులు తమ బలాలు, బలహీనతలు తెలుసుకోవచ్చు. ఆయా సబ్జెక్టులపై దృష్టి పెట్టేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. గణితం, ఫిజికల్ సైన్స్‌లో బాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్ తదితర రంగాల కెరీర్‌ను ఎంచుకోవచ్చు. బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపితే బాటనీ, జువాలజీ, మెడికల్, పారా మెడికల్, డెంటల్, వెటర్నరీ, అగ్రీకల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర రంగాల్లో దూసుకెళ్లవచ్చు. ఇక ఆరు పేపర్లకు బదులు ఏడు ఉండాలని, బయోలాజికల్, భౌతిక, రసాయన శాస్త్ర సబ్జెక్టులకు వేర్వేరుగా నిర్వహించాలని ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

ఇంటర్ పరీక్షలకు సమాయత్తం

- ఈసారి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షలు
- ఎగ్జామ్స్ రాయనున్న 31,890 మంది విద్యార్థులు



ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 10 : ఇంటర్ పరీక్షల నిర్వహణకు యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 16,006, ద్వితీయ సంవత్సరంలో 15,884మంది విద్యార్థులు మొత్తం 31,890మంది పరీక్షలు రాసేందుకు ఇంటర్ బోర్డుకు ఫీజు చెల్లించారు. వీరితో పాటు వృత్తివిద్యా విద్యార్థులు ప్రథమ సంవత్సరం 2,462, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,188 మంది ఉన్నారు. మొదటి సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల ప్రయోగ పరీక్షను వచ్చే నెల 16న నిర్వహించనున్నారు. విలువలు-మానవ సంబంధాలు పరీక్ష 17న, పర్యావరణ విద్య 19న జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తీర్ణత పెంపుపై దృష్టి

జిల్లాలో మొత్తం 152 జూనియర్ కళాశాలలు ఉండగా ఇప్పటికే కళాశాలల్లో ఆ కోర్సులకు సంబంధించి పాఠ్యప్రణాళిక పూర్తయింది. వెనుకబడిన విద్యార్థులకు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు యత్నిస్తున్నారు.

నిధులు కరువు..

కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణకు సంబంధించి పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సర్కారు నిధులు విడుదల చేయలేదు. దీంతో మొక్కుబడిగా ప్రయోగ పరీక్షలు జరపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యేక నిధులు విడుదల చేస్తేనే సత్ఫలితాలు ఆశించే వీలుంది. లేదంటే ప్రైవేటులో కన్నా ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు కొరవడి ప్రయోగ పరీక్షల్లో మార్కులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

నూరుశాతం ఫలితాల సాధన దిశగా

కె.రవిబాబు, డీఐఈవో, ఖమ్మం

ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. నూరుశాతం ఫలితాల సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈసారి కొత్తగా ఆంగ్లంలో ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు సంసిద్ధం కావాలి.

19, 20న కొత్తగూడెంలో కథా, కవితా కార్యశాల

- పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి సాహిత్య పోటీలు
- బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు


డా.వాసిరెడ్డి రమేష్‌బాబు

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, జనవరి 10: పిల్లల్లో పఠనాసక్తి, రచనా సామర్థ్యాన్ని పెంపొందించాలన్న సంకల్పంతో భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో 19, 20వ తేదీల్లో కథా, కవితా కార్యశాల నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ్ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు బుధవారం తెలిపారు. బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యం లో కొత్తగూడెం క్లబ్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థుల కోసం రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కథా, కవితా కార్యశాలను ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తున్నామన్నారు.



నేరాలను నిరోధించడమే ప్రథమ కర్తవ్యం

- సివిల్ కేసుల్లో వేలుపెడితే చట్టపరమైన చర్యలు
- సిటీ పోలీస్ యాక్ట్‌ను కచ్చితంగా అమలు చేస్తాం
- ఖమ్మం కొత్త సీపీ సునీల్‌దత్

ఖమ్మం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నేరాలను నిరోధించడంతో పాటు, నేరస్థులకు శిక్ష పడేలా చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని ఖమ్మం కొత్త సీపీ సునీల్‌దత్ పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆయన బుధవారం కమిషరేట్‌లోని తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. మాట్లాడుతూ కమిషనరేట్‌లో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా పోలీసింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పోలీసులు సివిల్ కేసులకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌కు సంబంధం లేకుండా ఎక్కడైనా పోలీసులు సివిల్ కేసుల్లో వేలు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ కేసు విషయంలోనూ సరైన రీతిలో విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. సిటీ పోలీస్ యాక్ట్‌ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించడం లాంటి వాటిని సహించేది లేదన్నారు. అన్ని అంశాలను సమీక్షిస్తున్నానని, అందులో భాగంగా పెండింగ్ కేసులు త్వరితగతిన విచారణ పూర్తిచేసేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. రహదారులపై నిత్యం ప్రమాదాలు జరిగే ప్రమాదాలను గతం నుంచే గుర్తిస్తున్నట్టు, వాటికి మరే ఇతర చర్యలు అవసరమైనప్పటికీ వాటిని సంబంధిత శాఖల అధికారులతో చర్చిస్తానన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి వాటిపై, ఇసుక అక్రమ రవాణాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపోయినట్టు గ్రహిస్తే వెంటనే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా పోగొట్టుకున్న నగదును నిలిపివేసి బాధితులకు న్యాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. గతంలో నిర్వహించినట్టుగానే ప్రతీవారం గ్రీవెన్స్ నిర్వహించి బాధితుల సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామని, ప్రజలు ఎక్కడైనా అన్యాయం జరిగినట్టు భావిస్తే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల వాలీబాల్ విజేత ఖమ్మం



ట్రోఫీని కైవసం చేసుకున్న జిల్లా జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 10: మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగులు వాలీబాల్ పోటీలలో ఖమ్మం జిల్లా జట్టు విజయకేతనం ఎగుర వేసింది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలలో మొత్తం 16 జట్లు పాల్గొనగా అందులో ఖమ్మం జిల్లా ఉద్యోగుల జట్టు విజేతగా నిలవడం విశేషం. బుధవారం జరిగిన ఫైనల్‌లో ఆతిథ్య మహబూబ్‌నగర్‌తో తలపడిన ఖమ్మం జిల్లా జట్టు 25-21, 25-19 స్కోరుతో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. దీంతో ఖమ్మం జట్టు ప్రథమ, మహబూబ్‌నగర్ ద్వితీయ, హైదరాబాద్ సౌత్ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర పోటీలో విజయం సాధించిన జిల్లా విద్యుత్ ఉద్యోగుల జట్టును, కెప్టెన్ గంటా వెంకటేశ్వరరావు, కోచ్ ప్రకాశ్, మేనేజర్ ఉపేందర్‌ను జిల్లా విద్యుత్ ఉద్యోగ సంఘాలు అభినందించాయి. భవిష్యత్ పోటీలలో సైతం విజయం సాధించి జిల్లా కు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో బాణాపురం విద్యార్థుల ప్రతిభ



శిక్షణా శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 10: ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పాల్వంచలో జరిగిన పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో ముదిగొండ మండలం బాణాపురం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. విద్యార్థుల చేజర్ల గౌతమ్, నాయిని కోమల్ శిక్షణా శిబిరంలో జరిగిన పలు అంశాల్లో ప్రతిభ చూపి అధికారుల మన్ననలు పొందారు. వారిని, కోచ్ గద్దపాటి శ్రీనివాస్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటినుంచి మహాదేవపురంలో రెండు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు

మధిర రూరల్, జనవరి 10: సంక్రాంతిని పురస్కరించుకొని మధిర మండలం మహాదేవపురం గ్రామంలో గ్రామపెద్దలు, కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల శుక్రవారంనుంచి తెలంగా ణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీవారు తెలిపారు. మహాదేవపురం జడ్పీఎస్ఎస్ స్కూల్ ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించబడతాయని, ప్రథమ బహుమతి రూ.35116, ద్వితీయ బహుమతి రూ.25116 అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీఫీజు రూ.500అని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి సౌకర్యం కల్పించనున్న ట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9908804935, 9000907011సెల్‌నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆట వస్తువులకోసం ఐటీడీఏ షార్ట్ టెండర్

భద్రాచలం, జనవరి 10: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలకు, వసతి గృహలకు కావాల్సిన ఆట వస్తువులు, క్రీడా సామగ్రి సరఫరా నిమిత్తం షీల్డ్ షార్ట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు 18వ తేదీ సాయంత్రం 5గంటలలోపు టెండర్ దాఖలు చేయాలని సూచించారు.

చలానాల బకాయిలు చెల్లించే వాహనదారులకు ఊరట

● 31 వరకు గడువు పెంపు

ఖమ్మం క్రైం/ కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, జనవరి10: ట్రాఫిక్ చలానాలు ఉన్న వాహనదారులకు కొంచె ఉరట లభించింది. పెండింగ్ చలనా లు ఉన్న వాహనదారులకు రాష్ట్ర పోలీసు అధికారులు ఇటీవలె తగ్గింపు ప్రకటించారు. ద్వీచక్ర వాహనాలకు 50శాతం, ఆటోలకు 80శాతం, కారులకు 60శాతం, లారీలకు 60శాతం, బస్సులకు 90శాతం తగ్గిస్తు చేల్లించే విధంగా వెసులుబాటు కల్పించారు. గత పది రోజుల నుండి ట్రాఫిక్ పోలీసులు కూడా ప్రత్యేక డ్రైవ్‌లుయ నిర్వహించి వాహనదారులకు చలాను చెల్లించాలలని సూచించారు. దీంతో పెండింగ్ చలానాలు ఉన్న వాహనదారులు కొంతమంది చెల్లించినప్పటికి మిగిలిన వారు చేల్లించేందుకు వెబ్ సైట్‌లు చూడగా గత రెండు రోజుల నుండి సర్వర్ సమస్యతో కొంత ఇబ్బందులు పడ్డారు. బుధవారం తో గడువు పూర్తవుతుంది అని అధికారులు మొదట తెలపడంతో వాహనదారులు ఆందోళన చెందారు.కానీ వాహనదారులకు ఈనెల 31 వరకు పెండింగ్ చలానాలు చెల్లించే విధంగా గడువును పొడగిస్తూ పోలీస్ శాఖ నుండి ప్రకటన వెలువడింది. దీంతో వాహనదారులకు కొంచెం ఉరట లభించింది.

కొత్తగూడెం పోస్టాఫిస్ సెంటర్: భద్రాద్రి జిల్లాలోని వివిధ రకాల వాహనదారులు వినియోగించుకున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఈ చెలానాలు 4,37,592 మంది వాహనదారులపై నమోదు చేశారు. ద్విచక్ర, త్రీ చక్ర వాహనాలకు 80 శాతం, కారుకు, హెవి వెహికిల్స్‌కు 60శాతం, బస్సులకు 90 శాతం డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ చెలానాలను చెల్లించేందుకు పేటీఎం, టీఎస్ ఆన్‌లైన్, ఈ చలానా, మీసేవా, ఆన్‌లైన్ ఇంటర్‌నెట్ సేవలలో ఆశ్రయించారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, జనవరి 10: అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతిచెందగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటకు చెందిన ఎన్.ప్రసాద్(45) గత కొంతకాలంగా అతిగా మద్యం సేవిస్తున్నారు. అనారోగ్యానికి గురైన ప్రసాద్ జంగారెడ్డిగూడెం రోడ్‌లో రోడ్డు ప్రక్కన గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడి తమ్ముడు స్వామి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గుట్టమల్లారం సర్పంచ్ ముత్తయ్యపై దాడి..

మణుగూరు, జనవరి 10: మండలంలోని గుట్టమల్లారం పంచాయతీ సర్పంచ్ కారం ముత్తయ్యపై బుధవారం స్థానిక యువకుడు దాడికి పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుట్టమల్లారం ప్రధాణ రహదారి నుంచి కమాలపురం వెళ్లే మూలమలుపు ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు స్థానికంగా ఉన్న కొందరు ప్రయత్నిస్తారు. ఇందులో బాగంగా ఆ స్థలం చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'తోపాటు పలు పత్రికలు, సోషల్ మీడియాలో ఈ ఆక్రమణ విషయం వైరల్ ఆవుతుంది. దీంతో సర్పంచ్ ముత్తయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ అధికారులు మీరే ఆ కంచెను తొలగించండి అని సలహా ఇచ్చారు. దీంతో ముత్తయ్య కంచె తొలగించే పనులు చేపట్టగా స్థానికంగా ఉన్న కొందరు ముత్తయతో వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడుతారు. ఈ విషయమై పోలీసులకు ముత్తయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పైపులైన్ పనుల అడ్డగింత

బూర్గంపాడు, జనవరి 10: బూర్గంపాడు మండల పరిదిలోని ఇరవెండి నుంచి సారపాక ఐటీసీ కర్మాగారానికి నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైపులైను పనులను బుధవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం....ఐటీసీ కర్మాగారానికి నూతనంగా పైపులైను ఏర్పాటు చేసే క్రమంలో నష్టపోతున్న రైతులకు ఉపాధి కల్పించకపోవడంతో పనులను అడ్డుకున్నట్లు తెలిపారు. తమకు ఉపాధి కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలని వాగ్వాదానికి దిగడంతో ఆదికారులు పనులను నిలిపివేసి వెనుదిరిగినట్లు తెలిపారు.

రహస్య సమావేశాలతో భూములను తీసుకోలేరు

- గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇచ్చేదిలేదు
- అధికారుల సమావేశాన్ని అడ్డుకున్న బాధిత రైతులు
- కనీసం సమాచారం ఇవ్వలేదని

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



తహసిల్థారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రఘునాథపాలెం, జనవరి 10: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల వ్యవసాయ భూములను గుంజుకోవాలని చూస్తున్న ప్రభుత్వం కనీసం బాధిత రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యాలయంలో నోటీసు బోర్డు లేకుండా త్రీడి సమావేశం ఎలా ఏర్పాటు చేశారని రఘునాథపాలెంతో పాటుగా సమీప మండలాల రైతులు ఆరోపించారు. బుధవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లూధర్ విల్సన్ అధ్యక్షతన అమరావతి నుంచి నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూ సేకరణపై త్రీడీ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశంపై రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, తహసీల్దార్ కార్యాలయంలో కనీసం నోటును కూడా ఏర్పాటు చేయలేదని తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సమావేశం జరుగుతున్న సమయంలో కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. బాధిత రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎవ్వరితో మాట్లాడేందుకు త్రీడి సమావేశం ఏర్పాటు చేశారని రైతులు అధికారులను ప్రశ్నించారు. మొక్కుబడిగా అధికారులు సమావేశాలు నిర్వహించి రైతుల ఆమోదం లేకుండా భూములు తీసుకుంటే ఉద్యమాలు చేస్తామని రైతు సంఘంనాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పంటలు పండే భూములను కోల్పోతున్నామని, ఖమ్మం నగరాన్ని చీల్చుకుంటూ నూతన కలెక్టరేట్‌కు సమీపంలో నుంచి వెళ్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను మార్పులు చేయాలని రైతులు నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్ నవీన్‌రెడ్డి, ప్రజాపంథా మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్ మాట్లాడుతూ కొరవినుంచి కోదాడకు వెళ్లే ఫోర్ లైన్‌కు గ్రీన్‌ఫీల్డ్ హైవేను మార్పులుచేసి అలైన్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయటం ద్వారా ఖమ్మం జిల్లాలో ఒక్క ఏకరం కూడా రైతులు భూములు కోల్పోరని పేర్కొన్నారు. భూ నిర్వాసిత జేఏసీ నాయకులు మందనపు రవీందర్, నాదెండ్ల శ్రీధర్, నల్లమోతు శ్రీను, ఎండపల్లి జగన్మోహన్‌రావు, కిషోర్, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై శబరిమలైకు..

అశ్వారావుపేట, జనవరి 10: అశ్వారావుపేటకు చెందిన ఇద్దరు స్నేహితులు ద్విచక్రవాహనంపై శబరిమలైకు పయనయమయ్యారు. పట్టణానికి చెందిన పాశం శ్రీనివాసరావు, అతని స్నేహితుడు వెంకటేశ్వరరావు 41రోజుల పాటు అయ్యప్పస్వామి దీక్షను పూర్తి చేసుకొని ద్విచక్రవాహనంపైన కేరళలోని శబరిమలై ఆలయానికి అయ్యప్పస్వామిని దర్శించుకొని ఇరుముడులను సమర్పించుకునేందుకు బయలుదేరారు. అశ్వారావుపేట నుంచి 1500 కి.మీటర్ల దూరంలో ఉన్న శబరిమలైకు ద్విచ క్రవాహనంపై వెళ్ళి, తిరిగి అదే వాహనంపై రావాలని నిశ్చయించుకున్నామని ఆమేరకు పయనమై వెళుతున్నామని శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మధిర రూరల్, జనవరి 10: మధిర మండలం దెందుకూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. దెందుకూరు గ్రామానికి చెందిన అల్లూరి వెంకటేశ్వర్లు ద్విచక్రవాహ నంపై పొలానికి వెళ్లి వస్తుండగా దెందుకూరు బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు గాయపడ్డాడు. దీంతో అతడికి స్వల్పగాయాలయ్యాయి.

గ్రానైట్ పరిశ్రమల సమస్యలను పరిష్కరించండి

- మంత్రి శ్రీధర్‌బాబుకు ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ నాయకుల వినతి



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 10: దేశంలోనే అత్యధిక మన్నికైన గ్రానైట్ కేవలం ఖమ్మం జిల్లా బ్లాక్ గ్రానైటేనని కాని ప్రస్తుతం ఆ పరిశ్రమ దీన స్థితిలో ఉందని పరిశ్రను ఆదుకోని పరిశ్రమకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల, వాణిజ్యశాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రల నాయకులు వినతిపత్రం అందించారు. ముఖ్యంగా పరిశ్రమకు ఉన్న సమస్యలు పెట్టుబడి సబ్సిడి, పవర్ రాయితీ, జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ, 40 శాతం రాయితో గ్రానైట్ స్లాబ్ వ్యవస్థను కొనసాగించాలని కోరారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ హబ్‌లను ఏర్పాటు చేయాలని, రా గ్రానైట్, ఫినిషింగ్ గ్రానైట్ ఎగుమతుల కోసం డ్రైపోర్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ గ్రానైట్ లీజులను త్వరగా క్లియర్ చేయాలని కోరారు. జీఎస్‌టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో స్లాబ్ గ్రానైట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, యుగంధర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టండి

- సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్
- మణుగూరు రైల్వే స్టేషన్ తనిఖీ



సూచనలు చేస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు

మణుగూరుటౌన్, జనవరి 10: మణుగూరు రైల్వే స్టేషన్, రైల్వే క్వార్టర్లను సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, సికింద్రబాద్ డివిజన్ జనరల్ మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ లు బుధవారం తనికీ చేశారు. ఇందులో బాగంగా సేఫ్టీ రికార్డులను పరిశీలించారు. రన్నింగ్ రూం, కిచెన్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. స్థానికంగా ఉన్న లోకో పైలట్‌ల తో మాట్లాడి స్టేషన్ పరిధిలోని సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే క్వార్టర్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్‌లను, పాడైపోయిన క్వార్టర్లను గమనించారు. వెంటనే క్వార్టర్ల మరమ్మతులకు కావాల్సిన చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీపీఎం నాయకులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం

- ప్లాంటేషన్‌లో చెట్లు నరికిన వారిని అప్పగించాలని సీపీఎం కార్యాలయంలోకి ఫారెస్టు సిబ్బంది
- అడ్డుకున్న నాయకులు
- సీపీఎం కార్యాలయంపై దాడికి యత్నించారని ఆందోళన

కారేపల్లి జనవరి 10: కారేపల్లిలోని సీపీఎం కార్యాలయంపై మండల ఫారెస్టు సిబ్బంది దాడికి యత్నించారని ఆరోపిస్తూ బుధవారం పార్టీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, పోడుసాగుదారులు ఆందోళన చేపట్టారు. ఇటీవల మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామంలో ఫారెస్టుకు సంబంధించిన ప్లాటేషన్‌లో ఉన్న పలురకాల చెట్లను పోడుసాగుదారులు నరికారు. అయితే ఈ విషయంపై 16 మందికి పైగా పోడుసాగుదారులపై సంబంధిత ఫారెస్టు సిబ్బంది కేసులు నమోదు చేశారు. వారిని నాలుగురోజులుగా ఫారెస్టు కార్యాలయానికి రావాలని ఫోన్లు చేస్తున్నారని పోడుసాగుదార్లు స్థానిక సీపీఎం నాయకులకు తెలిపారు. అయితే జరిగిన విషయంపై ఫారెస్టు అధికారులతో చర్చలు జరిపేందుకు సంబంధిత చెట్లు నరికినవారితో సీపీఎం జిల్లా నాయకులు ఎర్ర శ్రీకాంత్, భూక్యా వీరభద్రం, కొండబోయిన నాగేశ్వరరావు, తలారి దేవప్రకాష్‌తో పాటు స్థానిక మండల కార్యదర్శి కె.నరేందర్, వజ్జ రామారావు కార్యాలయంలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా రేంజర్ సిద్దార్ధారెడ్డితో పాటు సిబ్బంది కార్యాలయం వద్దకు చేరుకున్నారు. చెట్లునరికిన వారిలో 6గురిపై కేసు నమోదు అయిందనివారిని తమకు అప్పగించాలని కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నంచేశారు. దీంతో పార్టీనాయకులు అధికారులను అడ్డుకున్నారు. ఇదే సమయంలో అధికారులకు, పార్టీనాయకుల మధ్య తోపులాట తోపాటు తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. కొంత ఉద్రిక్తత వాతవరణం నెలకొంది. అయితే పార్టీ కార్యాలయంపై దాడికి ప్రయత్నంచారని ఆరోపిస్తు కార్యాలయం ఎదుట ఆందోళనచేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామారావు సిబ్బందితో తరలివచ్చారు. ఇరువర్గాలవారితో చర్చలు జరిపారు. పార్టీ కార్యాలయంపై దాడికి ప్రయత్నంచిన ఫారెస్టు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నాయకులు ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కారేపల్లి ఫారెస్టు రేంజర్ సిద్ధార్ధ మాట్లాడుతూ ఇప్పటికే అక్రమార్కులు ప్లాటేషన్లను ధ్వసంచేశారని వారిని వదిలే ప్రసక్తిలేదన్నారు. ప్రధాన కారకులుగా ఉన్న ఆరుగురిని గురువారం అదుపులోకి తీసుకుంటామని రేంజర్ తెలిపారు.





సీపీఎం కార్యాలయంఎదుట పెద్దసంఖ్యలో ఉన్న ఫారెస్టు సిబ్బంది, ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ముగ్గురిపై దాడి కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, జనవరి 10: భూవివాదం నేపథ్యంలో ముగ్గురిపై బుధవారం దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెన్నాడ రామకృష్ణకు. అదే గ్రామానికి చెందిన మరి కొంత మందికి కొంత కాలంగా భూవివాదం జరుగుతుంది. ఇదే తరుణంలో ఈనెల 5న రామకృష్ణ పొలం వద్దకు వెళ్లగా వెనక నుంచి వచ్చిన శింగలూరి బాలకృష్ణ, శింగలూరి నాగేశ్వరరావు, ఆళ్ల వెంకటేశ్వరరావు అనే వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాదితుడు ఆసుపత్రిలో చికిత్స పొంది బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురిపై దాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

కుర్నవల్లి సొసైటీలో విచారణ

తల్లాడ, జనవరి 10: తల్లాడ మండలం కుర్నవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో అవకతవకలు జరిగినట్లు కొందరు డైరెక్టర్లు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ నిర్వహించారు. సొసైటీలో అవకతవకలు జరిగాయని డిసెంబరు 30న రాష్ట్ర వ్యవసాయ సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సొసైటీ డైరెక్టర్లు యరమల వెంకటేశ్వర్‌రెడ్డి, పోతురాజు కోటయ్య, శీలం వెంకటేశ్వర్‌రెడ్డి, గోరింట్ల అక్కులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీసీవో కార్యాలయం సీనియర్ ఇన్‌స్పెక్టర్ షేక్.మౌలానా విచారణ జరిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం క్వింటాకు ఐదుకిలోలకు పైగా తరుగు తీశారని, బీఆర్ఎస్ పార్టీ అనుకూల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేసి, ధాన్యం విక్రయించని వ్యక్తుల ఖాతాల్లో డబ్బులు జమచేశారని పేర్కొన్నారు. ఇద్దరు డైరెక్టర్లు చనిపోగా వారి స్థానంలో కొత్తగా డైరెక్టర్ల నియామక తేది నిర్ణయం కోసం డిసెంబరు 21న సమావేశం నిర్వహించగా కోరం పూర్తికాకుండానే తీర్మానం చేశారంటూ ఫిర్యాదులో ఆరోపించారు. ఫిర్యాదు మేరకు జరిగిన విచారణకు సొసైటీ ఛైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి ఒగ్గు నర్సింహారెడ్డి, డైరెక్టర్లు పోతురాజు కోటయ్య, శీలం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

భవనంపైనుంచి పడి మేస్త్రీకి తీవ్రగాయాలు

తల్లాడ, జనవరి 10: తల్లాడలో నూతనంగా నిర్మిస్తున్న వాసవీ కల్యాణమండపం భవనంపైనుంచి పడి రాడ్‌బెండింగ్ మేస్త్రీ తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం కల్యాణమండపం భవనం నాల్గో అంతస్తు నిర్మాణం కోసం రాడ్‌బెండింగ్ చేస్తున్న తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మేస్త్రీ కాంపల్లి ముత్తయ్య ప్రమాదవశాత్తూ జారి కిందనున్న మూడో అంతస్తులో పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ముత్తయ్యను చికిత్స కోసం 108వాహనంలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆటో మొబైల్ షాపులో చోరీ

బోనకల్, జనవరి 10: మండలంలోని రావినూతల గ్రామ వేబ్రిడ్జి వద్ద గల ఆటో మొబైల్ షాపులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీ చేశారు. షాపు వెనుక తలుపులుపగులగొట్టి ఆయిల్ డబ్బాలు, నగదును చోరీ చేశారని షాపు యజమాని వాపోయాడు. ఈ సంఘటన పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా చోరీ జరిగిన షాపును పోలీసులు పరిశీలించారు. కొన్ని నెలల క్రితం ఇదే ప్రాంతంలోని ఓ షాపులో చోరి జరిగింది. ప్రదాన రహదారి పక్కనే ఉన్న షాపుల్లో ఎలాంటి భయం లేకుండా చోరీకి పాల్ప డటం పలువురిని విస్మయానికి గురి చేస్తుంది.

అయ్యప్ప దేవాలయంలో హుండీ అపహరణ

తల్లాడ, జనవరి 10: తల్లాడ మండలం కుర్నవల్లిలోని అయ్యప్పస్వామి దేవాలయం హుండీని మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారు. హుండీని ఎత్తుకెళ్లి సమీప పొలంలో తాళం పగులగొట్టారు. హుండీలోని సుమారు రూ.60వేల కానుకలను దొంగలు అపహరించుకుపోయారని ఆలయ కమిటీ ఛైర్మన్ అన్నెం కోటిరెడ్డి తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పాల్వంచ, జనవరి 10 : పాల్వంచలో బుధవారం పాల్వంచ టౌన్ పోలీసులు ఐదు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. పాత పాల్వంచ ముర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గుర్తించిన పోలీసులు వాటిని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేయనున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.


యువకుడిపై పోక్సో కేసు నమోదు

వైరా, జనవరి 10: ప్రేమపేరుతో ఓ బాలికను వేధిస్తున్న యువకుడిపై బుధవారం వైరా పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. వైరాలో తొమ్మిదోతరగతి చదువుతున్న ఓ బాలికను వైరా మునిసిపాలిటీ పరిధిలోని బోడేపూడి కాలనీకి చెందిన దుగ్గిరాల ప్రేమ్ అనే యువకుడు నిత్యం ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తాళలేక బాలిక ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలిపింది. దాంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి తమ కుమార్తెను వేధిస్తున్న యువకుడిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి బాలికను వేధిస్తున్న ప్రేమ్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదుచేశారు.

బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, జనవరి 10: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలిక(14)ను అదే గ్రామానికి చెందిన బాలుడు కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాలిక కుటుంబసభ్యులకు తెలపటంతో బాలిక తల్లి ఫిర్యాదు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

సమాచారం మాకు.. బహుమతి మీకు..



గోడ పత్రికలను అంటిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇల్లెందుటౌన్/మణుగూరు/పినపాక/ కరకగూడెం/ఆళ్లపల్లి/ గుండాల జనవరి 10: అజ్ఞాత మావోయిస్టుల సమాచారం అందిస్తే బహుమతులు ఇస్తామంటూ ఇల్లెందు పోలీసులు వినూత్న ప్రచారం చేపట్టారు. ఇల్లెందు సబ్‌డివిజన్ పరిధిలోని ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి తదితర మండలాలల్లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకుల ఫొటోలతో కూడిన పోస్టర్లను విస్తృతంగా గోడలకు అంటిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ పోస్టర్లపై మావోయిస్టు నాయకుల తలలపై ఉన్న రివార్డులను సమాచారం ఇచ్చిన వారికి బహుమతులు అందిస్తామని పేర్కొంటూ సమాచారం మాకు బహుమతులు మీకు అంటూ ప్రచారం చేశారు.

తమ్ముడిపై కత్తితో దాడిచేసిన అన్న

ఖమ్మం క్రైం, జనవరి 10: తమ్ముడిపై తన అన్న కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి నగర శివారులో జరిగింది. అగ్రహారం కాలనీలో నివాసం ఉంటున్న సంజీవ్‌సింగ్, బహదూర్‌సింగ్ అనే సోదరులు నగరంలోని జడ్పీ సెంటర్ సమీపంలోని బీరువా తయారీ షాపులో పనిచేస్తారు. బుధవారం రాత్రి ఇంట్లో ఇద్దరిమధ్య వాగ్వాదం జరగటంతో తమ్ముడు సంజీవ్‌సింగ్ పై అన్న బహదూర్‌సింగ్ కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో సంజీవ్‌సింగ్‌కు ఎడమవైపు డొక్క భాగంలో తీవ్ర గాయం అయింది. దీంతో స్థానికులు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

ఐఈడీ పేలి మూడో తరగతి విద్యార్థిని గాయాలు

- అనంతరం శిబిరంలో చికిత్స అందించిన మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ధ్రువీకరించిన పోలీసులు

చర్ల, జనవరి 10: మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందుపాతర పేలి మూడో తరగతి చదువుతున్న చిన్నారి, ఆమె తల్లి గాయపడగా దెబ్బలు తగిలిన చిన్నారిని మావోయిస్టులు ఎత్తుకెళ్లి చికిత్స అందిస్తున్న ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లా చేర్పాల్ రహదారిపై పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఐఈడీ మందుపాతర అమర్చగా ఈ రహదారిపై మూడో తరగతి చదువుతున్న చిన్నారి సునీత, ఆమె తల్లి నడుచుకుంటూ వెళుతుండగా అది పేలడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఈ విషయాన్ని గమనించిన మావోయిస్టులు గాయపడ్డ చిన్నారిని వెంటనే వారితో తీసుకెళ్లారు. వారి వైద్యశిబిరంలో చిన్నారికి వైద్యం అదిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో గాయపడ్డ చిన్నారి తల్లి స్థానిక వైద్యశాల్లో చికిత్స పొందుతుండగా ఆమె పరిస్థితి కూడా నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఘటన జరిగిన ఐదు రోజుల తరువాత బయటకు వచ్చింది. బీజాపూర్ పోలీసులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. చిన్నారిని మావోయిస్టుల నుంచి విడుదల చేయించేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

సుకుమా జిల్లాలో భారీ డంప్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని దంతేష్పురం, కోరాజ్‌గూడా గుట్టల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో బలగాలు అక్కడికి చేరుకోగా మావోయిస్టులు పారిపోయారు. వారి వద్ద ఉన్న సామగ్రిని అక్కడే వదిలిపెట్టారు. ఘటనా స్థలంలో గ్రేనేడ్ లాంచర్లు, తుపాకులు, కిట్‌బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సుకుమా పోలీసులు బుధవారం తెలిపారు.

కానిస్టేబుల్‌పై సీఐకి మహిళ ఫిర్యాదు

సత్తుపల్లి, జనవరి 10: సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో తన భూమిలో పనులు చేయిస్తూండగా పోలీస్ డ్రస్‌లో ఉన్న శ్రీనివాసరావు అనే వ్యక్తి వచ్చి తనను బెదిరించారని ఒక మహిళ సత్తుపల్లి సీఐకి ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి ఆమె ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన ఎస్.నాగలక్ష్మి సరిత అనే మహిళ గంగారంలో తన భూమిలో పనులు చేయించుకుంటూ ఉండగా కానిస్టేబుల్ డ్రస్‌లో వచ్చిన శ్రీనివాసరావు వచ్చి పనులు ఆపాలని, భూమిలో నుంచి వెళ్లాలని బెదిరించి భయభ్రాంతులకు గురి చేసారని, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొని పోలీస్టేషన్‌కు రావాలని సీఐ చెప్పినట్లు పేర్కొన్నారు. తనను బెదిరించిన శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు: సీఐ

ఈవిషయంపై సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబును సంప్రదించగా గంగారంలో గొడవ గురించి డయల్ 100కు ఫిర్యాదు అందిందని, దీనిపై వివరాలు సేకరించేందుకు కానిస్టేబుల్‌ను పంపామని, వివరాలు సేకరించే సమయంలో కానిస్టేబుల్‌పై మహిళ, అమె మనుషులు తిరగబడ్డారని సీఐ చెప్పారు. డ్యూటీలో ఉన్న పోలీసులపై తిరగబడటంచట్ట విరుద్ధమన్నారు.

గుండెపోటుతో భగీరథ కార్మికుడి మృతి



వైరా, జనవరి 10: మండలంలోని విప్పలమడక గ్రామంలో బుధవారం రాత్రి గుండెపోటుతో మిషన్ భగీరథ కార్మికుడు అక్కిశెట్టి శ్రీనివాసరావు (45) మృతిచెందాడు. విధులు ముగించుకొని ఇంటి వద్ద ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు మంచి భవిష్యత్

గత పాలకులు ఇబ్బందులు పెట్టినా.. బాధను దిగమింగా

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భావోద్వేగ ప్రసంగం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 10: గత ప్రభుత్వం నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేసిందని, ప్రస్తుత ఇందిరమ్మ రాజ్యంలో యువతకు మంచి భవిష్యత్ ఉండబోతోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలో రైట్ చాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడిన ఆయన ఓదశలో భావోద్వేగానికి గురయ్యారు. గత పాలకులు తనతో పాటు తన వెన్నంటి ఉన్న వారిని వేధించారని, అవమానించారని, అక్రమ కేసులు బనాయించారని.. అయినా కార్యకర్తలకు ఎంతో ధైర్యం చెప్పి బాధను దిగమింగానని, ఒంటరిగా ఉన్న సమయంలో కన్నీరు పెట్టిన రోజులున్నాయని, వాటినా తాను మరిచిపోలేనన్నారు. తాను బాధపడుతున్న విషయం కార్యకర్తలకు తెలిస్తే వారి ధైర్యం కోల్పోతారని, తానే బాధను అనుభవించానన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులంతా కష్టపడి పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని, ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలను ఇచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైట్ చాయిస్ అకాడమీ డైరెక్టర్ మెండెం కిరణ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజియన్‌లో కారుణ్య నియామకాలు

లబ్ధిపొందనున్న 43 మంది

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 10: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏడు డిపోల పరిధిలో 43మందికి కారుణ్య నియామకాలు అందుబాటులో ఉన్నాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. దీంతో రీజియన్ పరిధిలో 43మంది లబ్ధిపొందనున్నారు. ఐదేళ్లుగా ఆర్టీసీలో కారుణ్య నియామాకాలు లేకపోవటంతో వీరంతా ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజుల్లోనే కారుణ్య నియామాకాలు చేపట్టటంతో వీరందరికీ అవకాశం రానున్నది. ప్రభుత్వ ఆదేశాలతో రీజియన్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించటం జరిగిందని, వారిలో ముగ్గురు డ్రైవర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోగా.. వారికి డ్రైవింగ్ టెస్ట్ జరిపామని త్వరలోనే శిక్షణ అందించి పోస్టింగ్ ఇస్తామన్నారు. మిగిలిన వారిలో 33మంది కండక్టర్ పోస్టుకు దరఖాస్తులు చేసుకున్నారని ప్రస్తుతం రీజియన్‌లో కండక్టర్ పోస్టులు ఖాళీగా లేవని, త్వరలో కొత్త బస్సులు రాగానే వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. కొందరు సెక్యూరిటీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారని వారిని త్వరలోనే ఉద్యోగంలోకి తీసుకుంటామన్నారు.

ప్రత్యేక పోలీసు సిబ్బంది కోసం సీపీకి ఆర్టీసీ ఆర్ఎం వినతి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికుల భద్రతకు గాను బస్టాండ్లలో అదనపు పోలీసు సిబ్బందిని కేటాయించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కోరారు. నూతన సీపీగా బాధ్యతలు చేపట్టిన సునీల్‌దత్‌ను బుధవారం కలిసిన ఆయన తొలుత శుభాకాంక్షలు తెలిపి భద్రతకు సిబ్బందిని కేటాయించానలి వినతిపత్రం అందించారు. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, రాత్రి వేళ వచ్చిపోయే ప్రయాణికుల భద్రత కల్పించాలని, ప్రత్యేక సిబ్బందిని కేటాయించి పెట్రోలింగ్ పెంచాలని కోరారు. రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి తదితర బస్టాండ్లలో మహిళా ప్రయాణికులు పెరిగే ఆస్కారం ఉందని ఈ నేపథ్యంలో పటిష్ఠ భద్రత అవసరమని సీపీకి వివరించారు.

15వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమలు : సీపీ

ఖమ్మం క్రైం, జనవరి 10: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 15 వరకు కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ సునీల్‌దత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ నేపథ్యంలో ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.



దమ్మపేటలో రహదారిని కమ్మేసిన మంచు

మంచు కమ్మేస్తోంది. ఉదయం 9గంటల వరకు పొగమంచు పడుతుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారులు కనిపించక వాహనదారులు లైట్లు వేసుకుని వెళుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రయాణాలు చేస్తున్నారు. లారీలు ఇతర పెద్దవాహనాల డ్రైవర్లు మాత్రం మంచుదుప్పటి వీడిన తర్వాతే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఓ వైపు తీవ్ర చలి.. మరోవైపు మంచు కురుస్తున్న కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దగ్గు, జ్వరంతో పాటు శ్వాసకోశసమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- దమ్మపేట

ఖమ్మం మార్కెట్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంమార్కెట్ , జనవరి 10: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్‌కు వచ్చిన పంటల నాణ్యతను పరిశీలించారు. మిర్చి రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు నాణ్యత, ప్రమాణాలు పాటిస్తూ పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు పంటను తగినరీతిలో గ్రేడింగ్ చేసిన అనంతరమే మార్కెట్‌కు తీసుకురావాలని తద్వారా మంచి గిట్టుబాటు ధర దక్కుతుందని అన్నారు. ఉద్యానశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 92,274 ఎకరాల్లో మిర్చి సాగు చేశారని అందులో సుమారు 23,06, 860 క్వింటాళ్ల పంట దిగుబడి రానున్నట్లు తెలిపారు. ఇప్పటికి మార్కెట్ కమిటీల ద్వారా సుమారు 66,840 క్వింటాళ్ళు కొనుగోలు చేశామన్నారు. వ్యాపారులు కావాలని ధర తగ్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంబీపీ వీడీ రమణ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ అధికారులు తదితరులున్నారు.

నేటినుంచి మార్కెట్‌కు ఆరు రోజులు సెలవులు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి 16వతేదీ వరకు సెలవులున్నాయని మార్కెట్ ఇన్‌చార్జ్ సెక్రెటరీ బజారు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అమావాస్య కాగా.. 12న చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు పత్తియార్డుకు సెలవు ఉంటుందన్నారు. 13న శనివారం వారాంతపు సెలవు, 14న ఆదివారం, భోగి, 15 మకర సంక్రాంతి, 16న కనుమ సందర్భంగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. అయితే శుక్రవారం మాత్రం మిర్చి, అపరాల యార్డుల్లో కొనుగోళ్లు ఉంటాయన్నారు.

భూసేకరణను వేగిరం చేయాలి

అధికారులతో ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను మరింత వేగిరం చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, శ్రీరాం సాగర్, బుగ్గవాగు సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణపై నీటి పారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్ కాల్వ కింద చేపట్టాల్సిన 1717.35 ఎకరాలకుగాను 1570ఎకరాల భూసేకరణ పూర్తి చేసి అవార్డ్ పాస్ చేశామన్నారు. శ్రీరాంసాగర్ ప్యాకేజీలు 53, 54కి గాను ఇంకా 34.20ఎకరాల సేకరణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. సత్తుపల్లి ట్రంక్ కాల్వకుగాను 325.30 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి అవార్డు పాస్ చేసినట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి వ్యవసాయ, వ్యవసాయేతర భూమి ఎంత సేకరించాలో నివేదికలను అందించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు చెల్లించాల్సిన పరిహారం గ్రామాల వారీగా సమీక్ష చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్, డిప్యూటీ సీఈ ధన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఈలు ఆనంద్, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, ఏడీ లాండ్ సర్వే శ్రీనివాసులు, నీటిపారుదల శాఖ ఈఈలు, కలెక్టరేట్ భూసేకరణ విభాగం పర్యవేక్షకుడు రంజిత్, పాల్గొన్నారు.

ఉత్తమ కథగా ఎంపికైన 'ఆరోగ్యం'



దమ్మపేట, జనవరి 10 : బాలసాహిత్య పీఠం 2022కుగాను హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త కథల పోటీకి దమ్మపేట మండలం నాగుపల్లి జడ్పీపాఠశాల విద్యార్థి రచించిన కథ ఉత్తమ కథగా ఎంపికైందని బజ్జూరి సరళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చదువుతున్న చాపా నాగదినేష్ ఆరోగ్యం అనే కథను రచించి బాలసాహిత్య పీఠానికి పంపి సత్తా చాటాడన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు సునంద ప్రోత్సహంతో తన కథకు గుర్తింపు దక్కిందని నాగదినేష్ తెలిపాడు.

జాతీయ కబడ్డీపోటీలకు చల్లసముద్రం విద్యార్థి



ఇల్లెందురూరల్, జనవరి 10 : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇల్లెందు మండలం చల్లసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చెందిన కున్సోత్ లక్ష్మణ్ ఎంపికయ్యాడు. గత నెల హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టులో పాల్గొన్న లక్ష్మణ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో ఈనెల 12 నుంచి ఏపీలోని విశాఖపట్నంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. లక్ష్మణ్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఆయిల్‌ఫెడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తుమ్మల

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

పామాయిల్ దిగుబడుల పెంపునకు చర్యలు తీసుకోవాలి

ఆయిల్‌ఫెడ్ అధికారులకు మంత్రి తుమ్మల సూచన

దమ్మపేట, జనవరి 10 : రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయిల్‌ఫెడ్ అధికారులు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను తుమ్మల హైద్రాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని, వారి ఆశలు, అకాంక్షలను నెరవేర్చేలా అధికారులు పని చేయాలన్నారు. పంటల సాగులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అవసరమైన అన్ని అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అదేవిధంగా పామాయిల్ రైతులకు మరింత దిగుబడి పెంచేందుకు, ఉప ఉత్పత్తుల్లో రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంతరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేశ్వరరెడ్డి, మేనేజర్ టెక్నికల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో విభేదాలు సృష్టించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కుట్ర

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి10: బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిని బయట పెడుతూ, ప్రజల వద్దకు ప్రభుత్వ పరిపాలన తీసుకొచ్చిన కాంగ్రెస్‌లో విభేదాలు సృష్టించేందుకు బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో కుట్రలు జరుగుతున్నాయని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆరోపించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు మల్లు నందిని మాటలను ఈక్రమంలోనే వక్రీకరించారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ సత్తాను చాటిందని ఆమె చెప్పగా, ఈ మాటలను తప్పులుగా ప్రచారం చేశారన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ నాయకులు దామా స్వరూప, గుత్తా ద్రౌపతి, కొత్తపల్లి పుష్ప, నల్లమోతు సుగుణ, దివ్యా, గీతా, బిక్కసాని స్వరూప పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉమాశంకర్



కొణిజర్ల, జనవరి10: ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొణిజర్ల సూపర్‌జెమ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ కొనతం ఉమా శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉమాశంకర్ వైరా డివిజన్ అధ్యక్షుడిగా, జిల్లా జాయింట్ సెక్రటరీగా పని చేశాడు. సంక్రాంతి రవికుమార్, హుస్సేన్, ప్రవీణ్, కిరణ్, నరసింహారావు, ప్రసన్నలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఈ చలాన్ల'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కొండల్‌రావు

రఘునాథపాలెం,జనవరి10: ప్రభుత్వం కల్పించిన రాయితీ చలాన్ల సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రఘునాథపాలెం ఎస్ఐ కొండల్‌రావు వాహనదారులకు అవగాహన కల్పించారు. బుధవారం రఘునాథపాలెం వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన ఆయన ఇల్లెందు , ఖమ్మం రోడ్డుపై వస్తున్న పదుల సంఖ్యలో వాహనాలను నిలుపుదల చేసి ఆయా వాహనాల పెండింగ్ చలాన్లను రాయితీపై వసూళ్ల చేయించారు.

ముగ్గులు.. సంప్రదాయానికి ప్రతీక

కాంగ్రెస్ జిల్లా నాయకుడు దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, జనవరి10: ముగ్గులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మంత్రి పొంగులేటి క్యాంపుకార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లిలో బుధవారం వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు దయాకర్‌రెడ్డి బహుమతులను అందించారు. కార్యక్రమంలో రేగూరి హనుమంతరావు, దోసపాటి చంద్రశేఖర్, రేగూరి వాసవి, దోసపాటి కల్పన, షరాబు పవన్‌కుమార్, బోనగిరి యుగంధర్ పాల్గొన్నారు.

ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో ..

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్‌యూత్ అధ్యక్షులు తాటిపల్లి సుధీర్, వనమా వెంకటేష్, భరత్, మహాలక్ష్మీ, జ్యోతి, రహీం, నరేంద్రకుమార్, రఫీ, సురేష్, సైదారావు, మీరా సాహెబ్, మురళి, మోహన్‌రావు, అప్పారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

కల్లూరు: కల్లూరులోని బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఐద్వాఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణీ, ఎన్టీఆర్ జిల్లా యూటీఎఫ్ సహాయ అధ్యక్షురాలు అపర్ణ విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పద్మ,తల్లాడ ఐద్వా మండల కార్యదర్శి పకీరమ్మ, కల్లూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు రాయాల నాగేశ్వరరావు, బాధ్యులు సతీష్, శ్రీను, తన్నీరు కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

మాటూరు హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

మధిరరూరల్: మధిర మండలం మాటూరు ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు హెచ్ఎం చెరుపల్లి శ్రీధర్ బహుమతులు అందజేశారు.

వాణీ వివేకానందలో..

వైరా: వైరాలోని వాణీ వివేకానంద విద్యాలయంలో బుధవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చుండూరి కోటేశ్వరరావు, వాణి దంపతులు చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.

తల్లాడ: బాలభారతి విద్యాలయంలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు బొమ్మలకొలువు, భోగిమంటలు,సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మిస్ట్ కళాశాలలో..

సత్తుపల్లి: సత్తుపల్లిలో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ముందస్తుగా సంక్రాతి సంబురాలు జరుపుకున్నారు. ముగ్గులు పోటీలను నిర్వహించారు. బాలురకు గ్రామీణ- సంస్కృతి సంప్రదాయాల ప్రతిబింబించేలా పల్లె క్రీడలు నిర్వహించారు. పతంగులు ఎగురవేయటం, టగ్ ఆఫ్ వార్ అను పోటీలను నిర్వహించారు. విజేతలకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి బహుమతులందించారు. ప్రిన్సిపాల్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డిన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందచేస్తున్న దయాకర్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న డీఎం



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న చుండూరి కోటేశ్వరరావు, వాణి దంపతులు

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

ఖమ్మంకలెక్టరేట్, జనవరి10: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు తెలిపారు. జడ్పీ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరు కావాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రగతిపై చర్చించనున్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు



ఖమ్మంవ్యవసాయం, జనవరి10: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సామా నరసింహారావు(జీవై.నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం వీరయ్య, సెంట్రల్ ఈసీ సభ్యులు విడాల శ్రీనివాసరావు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్‌ను జాగ్రత్తగా చేయాలి

ఎమ్మెల్యే రాగమయి



కల్లూరులో దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జనవరి10: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని చాల జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ సాంబశివుడు, డిటి బాజ్జీ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు పాల్గొన్నారు.

పెనుబల్లి: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డేటాఎంట్రీ ప్రక్రియను బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి పరిశీలించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని 33గ్రామపంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తులను డేటా ఎంట్రీ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని, దరఖాస్తులకు సంబంధించిన అన్ని వివరాలను ఎంట్రీ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీవో వాల్మీకి కిషోర్, పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు సోమరాజు సీతారామారావు, మేకతొట్టి కాంతయ్య, గోదా చెన్నారావు, పులిబోతుల చెన్నారావు, వేముల కిరణ్ పాల్గొన్నారు.

తల్లాడ: అభయహస్తం ఆరు గ్యారెంటీల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే మండలప్రజాపరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ డేటా నమోదు ప్రక్రియను పరిశీలించి ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, ఎంపీటీసీ దగ్గుల రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పొట్టేటి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైరా: ప్రజాపాలనలో వచ్చిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ డేటా కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ పరిశీలించారు. తహసీల్దార్, మండల ప్రజాపరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు,ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో జ్యోత్స్నదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి తుమ్మల



రంగారావును పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి10: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన శెట్టి రంగారావు సోదరుడు సుధాకర్ కుటుంబ సభ్యుల్ని వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. బుధవారం రంగారావుకు ఇంటికి వెళ్లారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. 43వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ సుమంత్ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఖిల్లాలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సుడా డైరెక్టర్ ఖాదర్‌బాబా సోదరుడ్ని పరామర్శించారు. ముక్రమ్ నివాసంలో తెనేటీ విందులో పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధప డుతున్న గుత్తా అనంత రామయ్యను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఎండీ జావీద్, సాధు రమేశ్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, నల్లమల్ల వేణు పాల్గొన్నారు.

కొణిజర్లలో వికసిత భారత్ యాత్ర

కొణిజర్ల, జనవరి10: కొణిజర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం వికసిత భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండారు నరేష్‌బాబు,జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, సర్పంచ్ సూరంపల్లి రామారావు, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, శ్యామ్‌రాథోడ్, నెల్లూరు కోటేశ్వరరావు, సరస్వతి, త్రిలోకేశ్వర్, కవిడ రాంబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, జనవరి10: ప్రజాఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏదులాపురం, కొండాపురం ఆరెంపుల తదితర గ్రామాల్లో బుదవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. ఏదులాపురం, కొండాపురం గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లను ప్రారంభించారు. జిల్లాలో 56 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు నూతన భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకుడు, మాజీఎంపీటీసీ సభ్యులు గోకినపల్లి కొండలు గుండెపోటుతో మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏదులాపురంలో పద్మశ్రీ వనజీవి రామయ్య మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, సీపీ సునిల్‌దత్, కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎంహెచ్ఓ మాలతి, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీపీ బెల్లం ఉమా, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, సీపీఐ నాయకులు దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షుడు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పువ్వాళ్ల

వైరా, జనవరి10: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజీవ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలను బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. పోటీలు నిర్వహిస్తున్న రాజీవ్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు గరిడేపల్లి కిషోర్, షేక్.అంజద్‌పాషాను వారు అభినందించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు మిట్టపల్లి నాగి, పొదిల హరినాథ్, ధార్న రాజశేఖర్, చెరుకూరి కిరణ్, సూర్యదేవర శ్రీధర్, బోళ్ల గంగారావు, పణితి సైదులు, కర్నాటి హన్మంతరావు, సయ్యద్ అన్వర్, పోలా శ్రీను, పల్లపు కొండలు, నాళ్ల రమేష్, బండారు తిరుపతిరావు, కొల్లి రమేష్, దార్ల శేఖర్, పోటీల నిర్వాహకులు రవికుమార్, హనుమాన్, షేక్.హనీఫ్, వజ్రం, సన్నీ, నరేష్, నిఖిల్, సాయి, లాలయ్య పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు: సీఐ మోహన్‌బాబు

సత్తుపల్లి, జనవరి 10: యువత వ్యసనాలకు బానిసలు కావద్దని సత్తుపల్లి సీఐ జె మోహన్‌బాబు ప్రజలకు పిలుపు నిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షణికావేశానికిలోనై మత్తుపదార్థాలను తీసుకోవడం వల్ల కుటుంబానికి, సమాజానికి ఇబ్బంది కలుగుతోందన్నారు. అంతేకాక జీవితాలను కోల్పోతున్నారని చెప్పారు. ఇప్పటికైన మత్తు పదార్థాలకు బానిసలైన వారు వాటికి దూరంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఇప్పటి వరకు కోడిపందాలు, పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 30 మందిపై బైండవర్ కేసులు నమోదు చేశామని, సంక్రాతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాట స్థావరాలపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



వైరా, జనవరి10: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో కలిసి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.పదికోట్ల నిధులు మంజూరు చేసిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. వైరా నియోజకవర్గానికి ఇంకా ప్రత్యేక నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

వేంసూరు,జనవరి10: సత్తుపల్లికి చెందిన సుధా చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ కొనకళ్ల సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం వేంసూరు ప్రగతినగర్‌లోని వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం వారికి ఆరోగ్యపరంగా సలహాలు, సూచనలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ఏన్కూరు,జనవరి10: సమస్యల పరిష్కారానికి పోరాటాలే వరణ్యమని ఓపీడీఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య కోరారు. గ్రామీణపేదల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం బుధవారం ఏన్కూరులో కల్తీ రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో రాష్ట్ర నాయకులు పోలేబోయిన ముత్తయ్య, సోందు మియా, వేప వెంకన్న, ముడిగ రాములు పాల్గొన్నారు.

ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటాం

ఏన్కూరు, జనవరి10: ప్రసాద్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. ఇటీవల మండలంలో రేపల్లెవాడ గ్రామానికి చెందిన మృతిచెందిన మోదుగ ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకులు మాలోతు నరసింహారావు, నిమ్మల నరేందర్, సబాస్టీన్, విజయరావు, సామేలు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల దరఖాస్తులు తీసుకోరా: సీపీఎం

పెనుబల్లి,జనవరి10: మండలంలోని గ్రామస్థాయి అధికారులు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను కనీసం పరిశీలించకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గాయం తిరుపతిరావు, పోటు రాజారావు, మామిళ్ల వెంకటేశ్వర్లు, తడికమళ్ల చిరంజీవి, కంటే సత్యం పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి10: పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఖమ్మం నగర శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నరసింహారావు, వెంకన్న పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం పిండిప్రోలులో మండల నోడల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు హెచ్ఎం లక్ష్మిసుజాత ఆవిష్కరించారు.

వైజ్ఞానిక మహాసభను జయప్రదం చేయండి

నేలకొండపల్లి, జనవరి10: వచ్చేనెలలో ఖమ్మంలో జరుగనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ పెద్ది జగన్నాధం, మండల బాధ్యులు తేజావత్ గోవిందరావు కోరారు. బుధవారం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన టీపీటీఎఫ్ మండల మహాసభలో జగన్నాధం మాట్లాడారు. అంతకు ముందు టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

యూస్‌బీఐటీలో ఆటోకాడ్ శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి10: నగరంలోని యూస్‌బీఐటీలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం టాస్క్‌ఆధ్వర్యంలో ఆటోకాడ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఛైర్మెన్ గుండాల కృష్ణ, సంస్థ టెక్నికల్ ట్రైనర్ షాజుకుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ జీ.ధాత్రి మాట్లాడారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మధిరటౌన్,జనవరి10: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందేందుకు నమోదు చేసుకోవాలని మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. 2023 నవంబరు ఒకటవ తేదీనాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతీఒక్కరూ జాబితాలో ఓటు ఉండేలా చూసుకోవాలని కోరారు.

వీజీఎఫ్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

పెనుబల్లి, జనవరి10: పేదవిద్యార్థులకు సేవలందించటంలో విద్యార్థి గ్లోబల్ ఫౌండేషన్(వీజీఎఫ్) ముందుందని సత్తుపల్లి రూరల్ సీఐ హనుక్ అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పలువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లతోపాటు ఆర్థిక సహాయాన్ని సీఐ హనుక్ పంపిణీ చేశారు. జువాలజీ, కెమిస్ట్రీ ఉపాధ్యాయులను నియమించి జీతాలు అందిస్తున్నారని తెలిపారు. కేజీబీవీ పూర్వ విద్యార్థిని సమీనా ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

గొల్ల కురుమలు నష్టపోయారు: మల్లిబాబు

బోనకల్, జనవరి10: బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలతో గొల్ల, కురుమలు నష్టపోయారని డీసీసీబీ డైరెక్టర్ మల్లి బాబు యాదవ్ ఆరోపించారు. బోనకల్‌లో బుధవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో మాట్లాడారు. గతంలో అధికారులు, దళారులతో కుమ్మక్కై ఆంధ్రా నుంచి గొర్రెలను కొనుగోలు చేసి తిరిగి వాటినే రిసైక్లింగ్ చేశారని మండిపడ్డారు. ఈ సమావేశంలో యాదవసంఘ నాయకులు శ్రీనివాస్, గుమ్మ సైదులు, గంగుల గోపి, గంగుల నాగయ్య, పుల్లయ్య, నర్సింహరావు, వెంకటేశ్వర్లు, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

214 మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్పు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 10: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ ఇటీవల రాష్ట్రప్రభుత్వం జీవో జారీచేసింది. దీనిలో భాగంగా జిల్లాలో 214మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో ఏడు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 214 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ ఉత్తర్వులు అందించారు. కాగా గతంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం ఒక టీచర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చటంతో టీచర్‌తోపాటు ఆయాను నియమించనున్నారు. ప్రస్తుతం ఆయాలకు సంబంధించి నోటిఫికేషన్ త్వరలోనే రానున్నది.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కల్లూరు, జనవరి10: కల్లూరులోని మినీస్టేడియంలో బుధవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా కబ్బడీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణపర్‌బాబు ప్రకటించారు. ఎస్. యశ్వంత్ కుమార్(నాచారం),పి.ప్రవీణ్‌కుమార్(చెరువు మాదారం), జి.రాజేష్ (ఉప్పలచెలక), డి.రాజేష్ (వైరా), బి.అశోక్ (మన్నూరుతండ), వి.కౌశిక్ (ఉప్పల చిలుక), జి రాజేష్ (తీగలబంజర), ఎస్.శ్రీరామ్ (కల్లూరు), జి.నాగరాజు(కోర్లగూడెం),బి నవీన్‌కుమార్ (పుల్లయ్య బంజరు), ఎస్.సుశాంత్ (పెగళ్లపాడు), ఆర్ అనిల్ కుమార్ (గట్టుగూడెం), బి.శివసాయి (మన్నూరుతండ), బి.మహేష్(లక్ష్మాతండ) ఎంపికయ్యారు. వీరు గజ్వేల్‌లో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పార్టీ కార్యాలయంపై దాడులు సరికాదు

- సీపీఎం జిల్లా నేత శ్రీకాంత్
- దిష్టిబొమ్మ దహనం చేసిన నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి10: కారేపల్లి మండలంలోని సీపీఎం కార్యాలయంతో పాటుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై అటవీశాఖ అధికారులు దాడులు చేయటం హేయమైన చర్య అని ఆ పార్టీ జిల్లా కమిటీ ఇన్‌చార్జీ కార్యదర్శి యర్రా శ్రీకాంత్ ఆరోపించారు. మాణిక్యారం, ఎర్రబోడులో పోడు సాగుదారులు సాగు చేసుకుంటున్న భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని, ఇతర ప్రాంతాల్లో భూములు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. హామీని నెరవేర్చకపోగా పైగా పార్టీ కార్యాలయంపై దాడులు చేశారని ఆరోపించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎం పార్టీ కార్యాలయంలో పోడు సాగుదారులు ఉన్నారని బావించిన పోలీసులు, అటవీశాఖ అధికారులు ఎటువంటి వారెంట్ లేకుండా ఏకపక్షంగా దాడులుచేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వై విక్రమ్, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, ఎస్ నవీన్‌రెడ్డి, ఆర్ ప్రకాష్, బషీర్, అమరావతి, చింతల రమేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆఫీసుపై దాడి ప్రయత్నానికి ఖండన

వైరా: కారేపల్లి మండల సీపీఎం కార్యాలయమైన భాగం రామనర్సయ్య భవన్‌పై ఫారెస్ట్ అధికారులు చేసిన దాడి ప్రయత్నం సిగ్గుచేటని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు తీవ్రంగా ఖండించారు. బుధవారం వైరా సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు.ఈ సమావేశంలో పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, నాయకులు దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, నూకల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రయాణాన్ని ముందుగా ప్లాన్ చేసుకోవాలి

సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్



సత్తుపల్లి, జనవరి10: సంక్రాంతి సందర్భంగా సరిపడ బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణాన్ని ముందుగా ప్లాన్ చేసుకోవాలని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో డీఎం మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి సొంతూర్లకు వచ్చే ప్రయాణీకులు, పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్లటానికి ప్రయాణీకులు ముందస్తుగా ఒక ప్రణాళిక ప్రకారం వెళ్లాలని సూచించారు. డిపోలో సరిపడా బస్సులు ఉన్నప్పటికి మహాలక్ష్మీ పథకంతో ప్రయాణీకుల రద్దీ పెరిగే ఆవకాశం ఉన్నదన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారి వారి గమ్య స్థానాలకు చేర్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మేనేజర్ వివరించారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే కందాళ పరామర్శ



వెంకటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కందాళ

ఖమ్మంరూరల్, జనవరి10: మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బుధవారం పర్యటించారు. ముత్యాలగూడేనికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మేదరమెట్ల వెంకటయ్య, కస్నాతండా గ్రామంలో సీపీఐ సీనియర్‌నాయకుడు ఆజ్మీరా గోబ్రియా ఇటీవల మృతి చెందారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేదరమెట్ల శ్రీను, కాంతారావు, శ్రీనివాస్‌రావు, కామంచికల్ సర్పంచ్ వెంకటరమణమ్మ, దారేడు సర్పంచ్ సంగయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ కలింగరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు జంగాల ఉపేందర్, సొసైటి ఛైర్మన్ లక్ష్మన్, కార్పోరేటర్ నిరంజన్, కార్పోరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, బెల్లం వేణు, తొండల సత్యనారాయణ, వెంకన్న, భరత్, లింగయ్య, కృష్ణ, శేఖర్, జానీమియా, కలింగరెడ్డి, నవీన్‌రెడ్డి, సూర్యం, రాములు, కోటేష్, మౌలానా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నిమ్మల వెంకటరెడ్డి మాతృమూర్తి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కందాళ పరామర్శించారు. రాజారం గ్రామానికి చెందిన మందుల యల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిమ్మల వెంకటరెడ్డి, నిమ్మల నరసింహారెడ్డి, సర్పంచ్ బానాల మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొప్పుల మధుసూదన్‌రెడ్డిపాల్గొన్నారు.